# ఆధునిక పరిజ్ఞానంతో నేరాల అదుపు

- ఆండ్రాయిడ్ యాప్‌తో వేలిముద్రల సేకరణ, గుర్తింపు
- ఫింగర్ ప్రింట్ పరికరాలను ఆవిష్కరించిన సీపీ సుధీర్‌బాబు




ఫింగర్ ప్రింట్ పరికరాలను ఆవిష్కరిస్తున్న సీపీ సుధీర్‌బాబు

**వరంగల్:** ఆధునిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు అన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన 'పాప్ లాన్ ఆటోమెటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం'తో పనిచేసే లైవ్ స్కానర్లు, మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్‌లను గురువారం సీపీ సుధీర్‌బాబు ఆవిష్కరించి సంబంధిత విభాగం అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా నేరం జరిగిన సమయంలో నిం దితుల చేతులకు ఇంకు పూసి వాటిని రోలర్‌పై ముద్రించి ఆ ప్రతులను క్రైంబ్యూరోలో భద్రపర్చే వారని తెలిపారు. అయితే ప్రస్తుత టెక్నాలజీతో కేవలం వేలిముద్ర తీసుకుని దానిని ఆన్‌లైన్‌లో భద్రపర్చడంతో పాటు ఏకకాలంలో ఏడు లక్షల వేలిముద్రలతో పోల్చి చూడవచ్చని వివరించారు. కేవలం ఆరు నిమిషాల్లో వేలిముద్రలు తీసుకుని ఆ వివరాలను సర్వర్ భద్రపర్చుకోవచ్చన్నారు. సర్వర్‌లో అప్‌లోడ్ చేసిన వేలిముద్రలను అసరమున్నపుడు ప్రింట్లు తీసుకోవచ్చని, అంతే కాకుండా ఈ డేటాను ప్రపంచ వ్యాప్తంగా పోలీసుల విభాగాలు అనుసంధానం చేసుకోవచ్చన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రైసిటీలు, జనగామ, నర్సంపేట పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఈ మొబైల్ సెక్యూరిటీ డివైజ్‌లను అందజేస్తామని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే ఈ పరికరంతో వారి వేలి ముద్రలను స్పాట్‌లోనే సేకరించి ఆవ్యక్తి గత చరిత్రను నిమిషాల్లోనే తెలుసుకోవచ్చన్నారు. అనంతరం ఫింగర్ ప్రింట్స్ విభాగం ఇన్స్‌పెక్టర్ రఘును సీపీ శాలువాతో సన్మానించారు. డీసీపీలు వేణుగోపాలరావు, ఇస్మాయిల్, వెంకన్న, ఏసీపీలు, పాల్గొన్నారు.